# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 362 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 17, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

◆ పోలీస్ అధికారులకు డిజిపి జితేందర్ ఆదేశం




**హైదరాబాద్,జూలై15 (నమస్తే ఉదయం):** ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్య క్రమం ద్వారా అందించిన దరఖాస్తు లకు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ జితేందర్ పోలీసులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో మంగళవారం కార్యాలయంలో డీజీపీ సమావేశమయ్యారు. ఆయా జిల్లాలు, కమిషనరేట్‌లకు పంపిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

మిగతా.. 2లో

## రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా జేమ్స్ డేవిడ్ వాన్స్

◆ అధికారికంగా ప్రకటించిన అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్

◆ వాన్స్ భార్య ఉషా చిలుకూరి..ఏపి మూలాలున్న వ్యక్తి



**వాషింగ్టన్,జూలై16 (నమస్తే ఉదయం):** అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్‌లో జరగ నున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధ్యక్ష అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ పేరును రిపబ్లికన్ పార్టీ అధికా రికంగా ఖరారు చేసింది. మిల్వాకీలో సోమవారం జరిగిన సదస్సులో ట్రంప్‌కు నామి నేషన్‌ను కూడా అంద జేసింది. దీంతో ట్రంప్ తన ఉపాధ్యక్ష అభ్యర్థిగా

మిగతా.. 2లో

# ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలి



**రాజేంద్రనగర్ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రుణమాఫీ నిబంధనలే రైతుకు ఉరితాడుగా మారింది..**

**అధికారం చేపట్టి ఏడు నెలలు కాకముందే ఏడు రకాల దిబ్బలు పెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై 16(నమస్తే ఉదయం):** రైతులకు అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి ప్రభుత్వం నిబంధనల పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తోందని రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల

మిగతా.. 2లో



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటేయ్యండి..!

◆ ఫిరాయింపులను కట్టడి చేయాల్సిందే

◆ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించండి

◆ స్పీకర్‌ను కలిసిన బిఆర్ఎస్ బృందం

**హైదరాబాద్,జూలై16(నమస్తే ఉదయం):** పార్టీ ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీలో ఎమ్మెల్యేల బృందం స్పీకర్‌ను కలిశారు. ఈ మేరకు స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ మారారని తెలిపారు. స్పీకర్ ఆరు మాసాల్లోపు పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. మణిపూర్‌లో ఓ ఎమ్మెల్యేను అలాగే డిస్ క్వాల్గి చేశారని తెలిపారు. అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉన్నప్పటికీ మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని చెప్పిందని కేటీఆర్ అన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని రాహుల్ గాంధీ ఫోజులు

మిగతా.. 2లో



# ప్రజాపాలనే మా ప్రధమ ప్రాధాన్యం

◆ ప్రజల ప్రయోజనాలు అర్థం చేసుకుని పనిచేయండి

◆ భాషతోపాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వాములు కావాలి

◆ కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ దిశానిర్దేశం

◆ ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే

◆ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే బాధ్యత కలెక్టర్లదే

◆ ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదు

◆ కలెక్టర్లు అందరూ క్షేత్రస్ధాయిలో పర్యటించాల్సిందే

◆ అయిదేండ్లలో రూ.లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు

◆ రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

**హైదరాబాద్,జూలై16(నమస్తే ఉదయం):** పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు, ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్లతో ఇది రెండో సమావేశమని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని సీఎం గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి వారధులు.. సారధులు మీరేనని అన్నారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామన్నారు.

ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని సీఎం అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పని చేసినా.. అక్కడి జిల్లా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని, తాము పని చేసే ప్రాంత ప్రజలందరి అభిమానాన్ని అందుకునేలా పని చేయాలని సీఎం అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేసిందని, కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు సొంత కుటుంబసభ్యుడిలా స్పందించారు.


వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు ఉండాలని అభిప్రాయ పడ్డారు. అక్కడి ప్రజలు కలెక్టర్‌ను బదిలీ చేయకుండా అడ్డుకునేంత అనుబంధాన్నిసంపాదించుకోవాలని ఉదాహరణగా చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి.. వివిధ

మిగతా.. 2లో

## డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

◆ పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

◆ కలెక్టర్ల సదస్సులో సింఎం రేవంత్ కఠిన ఆదేశాలు



**హైదరాబాద్,జూలై15 (నమస్తే ఉదయం):** డ్రగ్స్ నియంత్రణ పైముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ నియంత్రణపైన పోలీస్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ విక్రయి స్తున్న విదేశీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ నగర శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలెక్టర్లు,ఎస్పీలో సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. మానవ అక్రమ రవాణా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో పీస్ కమిటీలను పునరుద్ధరించాలని చెప్పారు. బాధితుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి.. క్రిమినల్స్‌తో కాదని స్పష్టం చేశారు. డ్రంకన్ డ్రైవ్ తో పాటు డ్రైవ్ ఆన్ డ్రగ్స్ కూడా ఉండాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో రాత్రి పూట ఫుడ్ కోర్టల విషయంలో ఇబ్బంది రానివ్వొద్దని సూచించారు. నకిలీ విత్తనాలు తయారు చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు,

మిగతా.. 2లో

## ప్రజలతో మమేకం కండి

◆ మానవీయ కోణంలో చర్య తీసుకోండి

◆ తెలంగాణ సంస్కృతిలో మీరూ భాగస్వామ్యం కండి

◆ ప్రజలకు కళ్లు చెవుల్లాగా మెదలండి

◆ క్షేత్రస్థాయి పర్యటనలతోనే సమస్యలకు పరిష్కారం

◆ కలెక్టర్ల సదస్సులో సింఎం రేవంత్ సూచన

**హైదరాబాద్,జూలై16(నమస్తే ఉదయం):** ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని కలెక్టర్లతో సిఎం రేవంత అన్నారు. .. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఉన్నారు కనుక ప్రజల మనసెరిగి ప్రవర్తించాలని అన్నారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అన్నారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు లబ్ధి చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించ వచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి. ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా సంతృప్తి ఉండదు. డిసెంబర్ 24న కలెక్టర్లతో తొలిసారి భేటీ నిర్వహించాం. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి లబ్దిదారులను గుర్తించాలని ఆదేశించాం.

మిగతా.. 2లో



## కమిషన్ ఛైర్మన్‌ను మార్చండి

◆ రేవంత్ సర్కారుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

◆ కేసీఆర్‌కు సుప్రీంలో ఊరట

◆ వైదొలగిన విద్యుత్ విచారణ కమిషన్ జడ్జి

◆ సుప్రీం ఆదేశాలతో తప్పకున్న జస్టిస్ట్ నరసింహారెడ్డి

◆ ఇక కెసిఆర్ విచారణ ఎదుర్కోక తప్పదంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ,జూలై15(నమస్తే ఉదయం):** కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్ల కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారణకు అడ్డంకులు తొలిగాయి. జడ్జిని మార్చాలన్న సుప్రీం ఆదేశాలతో ప్రస్తుత కమిషన్ జడ్జి జస్టిస్ నరసింహారెడ్డి తన పదవి నుంచి తప్పుకున్నారు. కమిషన్ విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ కమిషన్

మిగతా.. 2లో

## 21న అఖిలపక్షం సమావేశం

◆ విపక్షనేతగా హాజరుకానున్న రాహుల్

**న్యూఢిల్లీ,జూలై15(నమస్తే ఉదయం):** ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఒకరోజు ముందు జులై 21నసోమవారం అఖిల పక్ష సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అన్ని పక్షాల సభా నాయకులు ఈ సమావేశానికి హాజరుకావాలని ప్రభుత్వం అహ్వానించినట్లు వర్గాలు మంళవారం తెలిపాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికైన రాహుల్ గాంధీ ఈ అఖిల పక్ష సమావేశానికి హాజరైన పక్షంలో పార్లమెంట్ సమావేశాలకు ముందు జరిగే సాంప్రదాయక సమావేశంలో పాల్గొనడం ఇదే మొదటిసారి అవుతుంది. కాగా..జులై 21వ తేదీని తమ పార్టీ అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నందున అఖిల పక్ష సమావేశానికి తాము హారుకాలేమని టిఎంసి తెలియచేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. 1993లో పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలో ఉన్న కాలంలో జులై 21న కోల్‌కతాలోని రాష్ట్ర సచివాలయానికి ఊరేగింపుగా వెళుతున్న కాంగ్రెస్ మద్దతుదారులపై పోలీసులు జరిపిన కాల్పులలో 13 మంది మరణించారు.

మరణించిన 13 మంది కాంగ్రెస్ మద్దతుదారులకు నివాళిగా జులై 21న





సంస్మరణ దినాన్ని టిఎంసి పాటిస్తోంది. ఈ కాల్పులు జరిగిన సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. 1998 జనవరి 1న తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత ప్రతి సంవత్సరం జులై 21న అమరవీరుల సంస్మరణార్థం ర్యాలీ నిర్వహిస్తోంది. పార్లమెంట్ బ్జడెట్ సమావేశాలు జులై 22న ప్రారంభమై ఆగస్టు 12న ముగియనున్నాయి.

జులై 23న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు.

## నేడు ఏకాదశి..మొహర్రం పర్వదినాలు

◆ సెలవు ప్రకటించిన ప్రభుత్వం

**హైదరాబాద్,జూలై15(నమస్తే ఉదయం):** ఈ బుధవారం రెండు పండగలు ఒకేసారి వచ్చాయి.. బుధవారం హిందూవుల తొలి ఏకాదశి.. కాగా, ముస్లింల మొహర్రం.. ఈ రెండు పండుగల ఒకే రోజు రావటంతో.. ప్రభుత్వం హాలిడే ప్రకటించింది. 17వ తేదీ స్కూల్స్ అన్నింటికీ సెలవు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం, ఈ సంవత్సరం ముహర్రం జూలై 7, 2024 నుండి ప్రారంభమవుతుంది. అషురా జరుపుకునే తేదీ జూలై 17...జులై 6న నెలవంక కనిపించినట్లయితే, ముహర్రం 9వ తేదీ .... అషురా జులై 15... 16 తేదీలలో జరుపుకుంటారు. లేకుంటే జులై 16, 17 తేదీల్లో పాటిస్తారు. ఇది ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల. ఈ మాసంలో షియా ముస్లింలు సంతాపం తెలుపుతారు.మొహర్రం... అంటే, అషురా, షియా ముస్లింలకు సంతాప దినం, ఎందుకంటే ముహమ్మద్ ప్రవక్త మనవడు హుసేన్ ఇబ్న్ అలీ అతని బంధువులతో కలిసి అమరుడయిన రోజని ముస్లిం మత పెద్దలు చెబుతుంటారు. ఈ రోజు ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. బుధవారం తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆషాఢమాసం శుక్లపక్షం ఏకాదశి.. తొలి ఏకాదశి పండుగ.. హిందువులకు ఎంతో పవిత్రమైన రోజు.. అంతేకాదు,



హిందువులకు తొలి పండుగను ఈ రోజునే జరుపుకుంటారు. దీనినే దేవశయని ఏకాదశి అనికూడా అంటారు. ఆరోజు భక్తులు విష్ణుమూర్తిని పూజించి దేవాలయాలను సందర్శిస్తారు. ఉపవాస వ్రతం పాటించి ఎంతో భక్తి శ్రద్దలతో భగవాన్నామస్మరణ చేస్తారు. పేలాల పిండిని తయారు చేసి స్వామికి నివేదన చేసి ప్రసాదంగా తీసుకుంటారు.

# ఉగ్రదాడిలో నలుగురు సైనికుల వీరమరణం

### ఉగ్రవాదుల ఏరివేతకు ఆర్మీకి పూర్తి స్వేచ్ఛ: రాజ్‌నాథ్

**శ్రీనగర్,జూలై16(నమస్తే ఉదయం):** జమ్మూ-కాశ్మీర్‌లోని దోడాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు భారత ఆర్మీ సైనికులు వీరమరణం పొందిన నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రంగంలోకి దిగారు. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీతో మాట్లాడారు. నలుగురు సైనికులు అమరులు అయిన నేపథ్యంలో ఎలాంటి చర్యలైనా తీసుకునేందుకు స్వేచ్ఛ ఇస్తున్నట్టు ఆర్మీ చీఫ్‌కు రక్షణమంత్రి చెప్పారు. ఇక ఎన్‌కౌంటర్‌కు సంబంధించి దోడాలో పరిస్థితులు, కొనసాగుతున్న ఆపరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం తెల్లవారు జామున సాయుధ ఉగ్రవాదులతో భారత ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక పోలీసు బలగాలు సంయుక్తంగా ఎన్‌కౌంటర్ ఆపరేషన్ చేశారు. అయితే ఈ ఆపరేషన్‌లో ఒక అధికారితో సహా నలుగురు సైనికులు అసువులు బాశారు. పలువురికి గాయాలు అయినట్టు ఆర్మీ వర్గాలు తెలిపాయి. రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ మొదలైంది. అయితే ఉగ్రవాదులు దొంగదెబ్బ తీయడంతో నలుగురు జవాన్లు కోల్పోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. జమ్మూ ప్రాంతంలో ఇటీవల జరిగి రెండో అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు చెబుతున్నారు. గతవారం కథువాలో ఐదుగురు సైనికులు మరణించారని, ఆ తర్వాత ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్ అని చెప్పారు. కాగా జమ్మూ ప్రాంతంలో తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో ఆర్మీని కోరారు. దీంతో బలగాలు రంగంలోకి దిగి జల్లెడ పడుతూ ఉగ్రమూకలను ఏరివేస్తున్నాయి.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటేయ్యండి..!

(మొదటిపేజీ తరువాత)

కొడుతూ.. బయట ఫిరాయిం పులు ప్రోత్సహిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే అక్కడ ఫిరాయింపులపై కాంగ్రెస్ పోరాడుతోందని అన్నారు. గోవాలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీ మారబోమని ప్రమాణం చేయించారన్నారు. పార్టీ ఫిరాయింపులు అనైతికమని స్పీకర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. స్పీకర్ ఆ పది మందిపై అనర్హత వేటు వేస్తారని నమ్మకం ఉందన్నారు. కడియం శ్రీహరి ముందు నుంచే కోవర్ట్‌గా ఉన్నారని అనుమానం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో ఓడిపోయిన అభ్యర్థులు కార్యక్రమాలు చేస్తున్నారని.. అధికారులు వారిని స్టేజి మీద కూర్చోబెడున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... పార్టీ కండువాలు కప్పుకుని ఓడిన అభ్యర్థులు చెక్కులు పంపిణీ చేస్తున్నారన్నారని సబిత అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు రివ్యూ చేస్తే వచ్చే అధికారులను సస్పెండ్ చేస్తున్నారని తెలిపారు. 'ఇదేనా ప్రజాస్వామ్యం.. పాలన ఎటువైపు పోతుంది' అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాడితే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తమ హక్కులను పరిరక్షించాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలా జరక్కుండా చూడాలని విజ్ఞప్తి చేశామని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత పద్మారావు అన్నారు. ప్రారంభాలకు, చెక్కుల పంపిణీకి ఓడిన అభ్యర్థులను అనుమతి ఇస్తున్నారన్నారు. మరి ఓడిన అభ్యర్థులను అసెంబ్లీలోకి కూడా అనుమతిస్తారా అని స్పీకర్‌ను అడిగినట్లు తెలిపారు. ఓుగా... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో స్పీకర్‌ను పార్టీ ఎమ్మెల్యేలు కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ పాటించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఎమ్మెల్యేలు వినతి పత్రం ఇచ్చారు.

# ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటగా రైతు సాయం,రైతు భరోసా వేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్ సర్కార్ విధి విధానాలు అభిప్రాయ సేకరణ అంటూ కాలయాపన చేస్తున్నారని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు.మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. అలివి కాని 6 గ్యారంటీలు ఆమె ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజలను నిబంధనల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు.మొదట చెప్పిన విధంగా అర్హులైన రైతులకు వెంటనే రైతు భరోసా,అలాగే ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేయాలన్నారు.రుణమాఫీ నిబంధనలే రైతుకు ఉరితాడుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.దరఖాస్తులు తీసుకొని 7 నెలలైనా రేషన్‌కార్డులు ఇవ్వని ముఖ్యమంత్రి రుణమాఫీ కావాలంటే తెల్లరేషన్ కార్డు ఉండాలని నిబంధనలు పెట్టాడం ఏంటని ప్రశ్నించారు.కేసీఆర్‌ను ఓడించాలని అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడు నెలలు కాకముందే ఏడు రకాల తిప్పలు పెడుతుందని ధ్వజమెత్తారు.విశ్వసనీయత లేని ప్రభుత్వమనే కేసీఆర్?కు బొంద పెట్టారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని అహంకారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

అధికారం చేపట్టి ఏడు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి ఏడు రకాల తిప్పలు పెడుతున్నారని తోకల శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు. రైతుల శాపనార్థలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగలడం ఖాయమన్నారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్?లోకి వెళ్ళినప్పుడు ఎంతకు అమ్ముడుపోయారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తు చేశారు.తాజాగా పార్టీ ఫిరాయింపుల విషయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ జుట్టులోకెళ్లి వచ్చాడని విమర్శించారు.పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతు రుణమాఫీ,రైతు బంధు,బోనస్ ఇవ్వడం మీద లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పిల్లలకు పోషకాహారం విధిగా అందించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

### పోషకాహారంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16 (నమస్తే ఉదయం):**

మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేస్తూ ప్రజలతో మమేకమై "న్యూట్రిషన్ ఛాంపియన్స్ "కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు సూచించారు.మంగళవారం ఐ.డి.ఓ.సి.లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసూతి శిశు చిన్న పిల్లల పోషణ , పిల్లలలో తీవ్రమైన పోషకాహార లోపం ,సమగ్ర నిర్వహణ పై జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్



ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలోని (SAM,MAM,SUW) లోపం, పిల్లల పోషణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే ఇప్పటి వరకు కొంతమేర అభివృద్ధి జరిగిందని అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి లోపపోషణతో బాధ పడుతున్న పిల్లలను నార్మల్ స్థాయికి తీసుకురావాలని, అదేవిధంగా అనీమియాతో బాధ పడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గట్టు మండలం వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడింది కావున గట్టు మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఎంతో అవసరమని, అంగన్వాడి టీచర్, ఎ.ఎన్.ఎం ,ఆశ ముగ్గురు కలిపి కృషి చేస్తే లోప పోషణ తగ్గించవచ్చని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారు తీసుకున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. లోప పోషణతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు పరిశుభ్రతను పాటిస్తూ పిల్లలకు ఆహారం ఇవ్వాలని, ఆరోగ్య పరీక్షలు చేయించి ఎన్.ఆర్.సి. కి పంపేవిధంగా అవగాహన కల్పించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఓ. సుధారాణి, జడ్.పి.సి.ఇ.ఓ కాంతమ్మ. ప్రోగ్రాం ఆఫీసర్ డా. స్రవంతి, డా. రాజు, మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్, సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనే మా ప్రధమ ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాత)

సంస్కృతుల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తున్నారని, విధి నిర్వహణలో భాగంగా ఇక్కడి భాష నేర్చుకుంటే సరిపోదని, భాషతో పాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యం కావాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. తెలంగాణను తమ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని, ఇక్కడి ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

ఒక శంకరన్, ఒక శ్రీధరన్ లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఐఏఎస్లు పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని.. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదని అన్నారు. తాము చేపట్టే ప్రతి పని.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు.

జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85వేలు ఖర్చు పెడుతుందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు.

'గతంలో పది పెద్ద జిల్లాలుండేవి. అప్పుడు పది మంది కలెక్టర్లే ఈ రాష్ట్రాన్ని అద్భుతంగా నడిపించారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. అప్పటితో పోలిస్తే కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. అప్పుడు పది మంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది కలెక్టర్లు కలిసికట్టుగా ఎందుకు చేయలేరు..? ఎవరికివారుగా మీ ఆలోచనలు, మీ పని తీరును సమర్థతను చాటుకోవాలి. ఇది ప్రజా ప్రభుత్వం. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ప్రజలకు విశ్వాసం కల్పించే బాధ్యత మీదే...' అని సీఎం కలెక్టర్లకు మార్గదర్శనం చేశారు.

కలెక్టరేట్లలో ప్రతివారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్‌లో ప్రజాభవన్‌కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందని, అదే మీ పనితీరుకు అద్దం పడుతుందని సీఎం అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు.

ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనేది ప్రభుత్వ ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని గృహ జ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకాలకు అర్హులెవరికైనా ఈ పథకం వర్తించకపోతే.. తమ ఆధార్, రేషన్ కార్డు, లేదా గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్తు సర్వీసు నెంబర్లు సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు పని చేసేలా చూడాలని, అవసరమైతే ప్రజావాణి జరిగే రోజున కలెక్టరేట్లలోనూ సేవాకేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు గృహజ్యోతికి 5.89 లక్షల మంది, ఐదు వందలకు గ్యాస్ సిలిండర్ పథకానికి 3.32 లక్షల మంది సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వివరించారు.

పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. 'ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి మార్చి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది.

అప్పటి నుంచి ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించిందని, కొత్తగా 1,15,308 దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వివరించారు. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అధికారులు తిరస్కరణకు కారణాన్నికూడా తప్పకుండా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆగస్టు 15లోగా పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మందిని సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీరిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం ప్రకటించారు.

అయిదేండ్లలో రూ. లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, చేపట్టే వ్యాపారాలకు తమ వినూత్న ఆలోచనలు కూడా జోడించాలని కలెక్టర్లకు సూచించారు. ఆర్టీసీలో కొత్తగా అవసరమయ్యే అద్దె బస్సులు కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని చెప్పారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ భూములు, చెర్వులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీఎం కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అవసరమైతే జియో ట్యాగింగ్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కమాండ్ కంట్రోల్ సెంటర్తో అనుసంధానం చేసి.. ప్రభుత్వ భూములపై నిఘా ఉంచాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని ఆదేశించారు. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సేవలందించే ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఉందని, అధ్యయనం చేసి అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు.

రూరల్ ఏరియాలో పనిచేసే డాక్టర్లకు పారితోషికం అందించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్ కు ఒక సీరియల్ నెంబర్ ఉండాలని, గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆసుపత్రుల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం చెప్పారు. స్థానికంగా స్వచ్ఛంద సంస్థల సహకారం, పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు తీసుకోవాలని, వ్యాపార వాణిజ్యవేత్తల భాగస్వామ్యం తీసుకొని వాటి నిర్వహణ మెరుగుపరిచే విధానాన్ని అవలంబించాలని సూచించారు. అనుభవజ్ఞులైన స్పెషాలిటీ డాక్టర్లను ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి వైద్య సేవలకు వినియోగించుకోవాలని, మిగతా డాక్టర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు.

# రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా జేమ్స్ డేవిడ్‌వాన్స్

(మొదటిపేజీ తరువాత)

అత్యంత విధేయుడైన జేమ్స్ డేవిడ్ వాన్స్ పేరును ప్రకటించారు. కాగా డేవిడ్ వాన్స్ భార్య భారతీయ-అమెరికన్. ఆమె పేరు ఉషా చిలుకూరి వాన్స్. ఆమె మూలాలు మన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆమె తల్లి దండ్రులు భారతీయ వలసదారులుగా శాన్ ఫ్రాన్సిస్కోలో స్థిరపడ్డారు. ఉషా 1986లో పుట్టారు. ఆమె ఉన్నత విద్య అభ్యసించారు. ప్రస్తుతం శాన్ ఫ్రాన్సిస్కోలోని ఒక ప్రతిష్ఠాత్మక సంస్థలో కార్పొరేట్ న్యాయవాదిగా పని చేస్తున్నారు. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం.. ఆమె యేల్ విశ్వవిద్యాలయం నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని పొందారు. ఉషా వాన్స్ వృత్తిపరంగా కూడా మంచి ట్రాక్ రికార్డును కలిగివున్నారు. న్యాయవాదిగా నామినేట్ అవ్వడానికి ముందు ఆమె సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్ వద్ద సహాయకురాలిగా పనిచేశారు. అంతేకాదు యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా, ది యేల్ లా జర్నల్ ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా కూడా పని చేశారు. ఆమె తర్వాత ముంగెర్, టోల్లెస్, ఓల్సన్ సంస్థలకు కార్పొరేట్ న్యాయవాదిగా పనిచేశారు. యేల్ యూనివర్సిటీలో నాలుగేళ్లపాటు పాఠ్యేతర కార్యకలాపాలు నిర్వహించిన తర్వాత కేంబ్రిడ్జ్ నుంచి ఉషా చిలుకూరికి గేట్స్ ఫెలోషిప్ దక్కింది. దీంతో ఆమె తన అధ్యయనాలను కొనసాగించారు. కేంబ్రిడ్జ్‌లో వామపక్ష, ఉదారవాద బృందాలతో కలిసి పనిచేశారు. 2014లో డెమొక్రాట్ పార్టీ సభ్యురాలిగా ఆమె రిజిస్టర్ అయ్యారు. కాగా యేల్ లా స్కూల్‌లో స్కాలర్‌షిప్ పొందిన జేమ్స్ డేవిడ్ వాన్స్‌తో ఉషా చిలుకూరికి పరిచయం అయ్యింది. ఒకరినొకరు ఇష్టపడడంతో 2014లో ఈ జంట కెంటుకీలో పెళ్లి చేసుకున్నారు. ఒక హిందూ పూజారి ప్రత్యేక నిర్వహించిన వేడుకలో ఇద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఉషా వాన్స్ తన భర్త జేమ్స్ డేవిడ్ జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగడంలో కీలక పాత్ర పోషించారు. అమెరికా గ్రామీణంలో దిగజారుతున్న పరిస్థితులపై ఆయన ఆలోచనలకు ఒక రూపం తీసుకొచ్చి 'హిల్‌బిల్లీ ఎలిజీ' పేరిట బుక్‌గా రూపాంతరం చెందించారు. ట్రంప్ కుటుంబానికి వాన్స్ ఎలా దగ్గరయ్యారు వంటి ఆసక్తికరమైన విషయాలను ఇందులో పొందుపరిచారు. 2016లో ఈ బుక్ అమెరికాలో అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల్లో ఒకటిగా నిలిచింది. గ్రామీణ అమెరికా ప్రజలు ట్రంప్‌ను ఏవిధంగా అధికారంలోకి తీసుకొచ్చారో ఈ బుక్‌లో వివరించారు. ఇక ఒహియో సెనేట్ సీటులో గెలుపు కోసం డేవిడ్ వాన్స్ ప్రయత్నిస్తున్నప్పుడు కూడా ఆమె తనవంతు సహకారం అందించారు. జేమ్స్ డేవిడ్ వాన్స్-ఉషా చిలుకూరి వాన్స్ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి పేర్లు ఇవాన్( 6), వివేక్(4), మిరాబెల్(2).

0రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా తన భర్త ఎంపికైన నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ.. మా జీవితాల్లో ఏ మార్పు రావాలని కోరుకోవడం లేదు. కానీ జేమ్స్‌పై నాకు నమ్మకం ఉంది. అతనంటే నాకు చాలా ప్రేమ. జీవితంలో ఏం జరుగుతుందో వేచిచూద్దాం' అని ఒక ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. మరో ఇంటర్వ్యూలో ఆమె



మాట్లాడుతూ.. 'నేను మతపరమైన కుటుంబంలో పుట్టి పెరిగాను. నా తల్లిదండ్రులు హిందువులు. హిందుమతం వారిని మంచి తల్లిదండ్రులను చాలా మంచి వ్యక్తులుగా మార్చింది. అది చూస్తూ నేను పెరిగాను. జేమ్స్ వాన్స్ దేని కోసం ఆరాటపడుతున్నాడో నాకు. అది అతనికి సరైనదనిపించింది' అని ఆమె చెప్పారు. కాగా అమెరికా రాజకీయ వ్యవస్థలో భారతీయుల ప్రాబల్యం, మన సంస్కృతికి అక్కడి రాజకీయ నాయకులు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో తెలియజేస్తోంది. ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఒహాయో సెనెటర్ జె.డి.వాన్స్ పేరును ట్రంప్ ప్రకటించారు. మిడిల్‌టన్‌లో జన్మించిన జె.డి.వాన్స్ మెరైన్ విభాగంలో అమెరికాకు సేవలందించారు. కఠినమైన ఆర్థిక పరిస్థితుల మధ్య పెరిగారు. వాన్స్ తండ్రి చిన్నప్పుడే వారిని వదిలి వెళ్లిపోయారు. తల్లి మాదకద్రవ్యాలకు బానిసయ్యారు. దీంతో వాన్స్ తాతయ్య దగ్గర పెరిగారు. ఒహాయో స్టేట్ యూనివర్సిటీ, యేల్ లా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడయ్యారు. యేల్ లా జర్నల్‌కు సంపాదకుడిగా ఉన్నారు. ఆయన రచించిన 'హిల్‌బిల్లీ ఎలెజీ' పుస్తకం అత్యధికంగా అమ్ముడు కావడంతో పాటు సినిమాగా రూపొందింది. సాంకేతికత, ఆర్థిక రంగాల్లో ఆయన విజయవంతమైన వ్యాపారవేత్త కూడా. 39 ఏళ్ల వాన్స్ 2022లో అమెరికా సెనేట్‌కు ఎన్నికయ్యారు. మొదట్లో ట్రంప్ విధానాలను విమర్శిస్తూ వచ్చి చివరకు విధేయుడిగా మారారు. యేల్ లా స్కూల్‌లోనే ఉషా, జె.డి.వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. 2014లో కెంటకీలో వారు వివాహం చేసుకున్నారు. ప్రత్యేకంగా హిందూ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవడం విశేషం.

# కమిషన్ చైర్మన్‌ను మార్చండి

(మొదటిపేజీ తరువాత)

చైర్మన్‌గా ఉంటూ ప్రెస్ మీట్ ఎలా పెడతారని..తన అభిప్రాయాల్ని ఎలా వెలిబుచ్చాతారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తి న్యాయం చెప్పడమే కాకుండా.. నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. విద్యుత్ కమిషన్ చైర్మన్ గా మరొక జడ్జిని నియమించాలని సూచించారు. చీఫ్ జస్టిస్ సూచనకు తెలంగాణ ప్రభుత్వ లాయర్ అంగీకరించారు. మధ్యాహ్నం తర్వాత కొత్త విద్యుత్ కమిషన్ చైర్మన్ గా ఎవరిని నియమిస్తారో చెప్పాలన్నారు. విద్యుత్ కమిషన్ నియామకం, ఆ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి ముందుగానే అభిప్రాయాలు చెప్పడం వంటి వాటిపై కేసీఆర్ మొదటి నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ వేయగా.. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ గులాబీ బాస్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. కమిషన్ చైర్మన్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముందే నిర్ణయానికి వచ్చినట్లుగా ప్రెస్ మీట్లు పెడుతున్నారని కోర్టుదృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ముందు హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ అనుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1952, విద్యుత్తు చట్టం-2003కి అది విరుద్ధమని.. దాన్ని రద్దుచేయాలని కేసీఆర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తు కొనుగోళ్లపై వివాదం ఉంటే.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండళ్లు తేల్చాలే తప్ప.. దానిపై విచారించే అధికారం కమిషన్‌కు లేదని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ .. ప్రస్తుత విద్యుత్ కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ పెట్టడంపైనే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యక్తం చేసిన అభ్యంతరాల్లో అది కూడా ఒకటి. కొత్త న్యాయమూర్తి పేరును చెప్పిన తర్వాత విచారణ కొనసాగించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే.. అది కేసీఆర్ కు ఇబ్బందేనని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇక కేసీఆర్‌కు అన్ని దారులు మూసుకుపోయినట్లే అనుకోవచ్చు. కమిషన్ విచారణను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అసలు కమిషనే చట్ట విరుద్ధం కాబట్టి విచారణ ఏం ఉండదని అనుకుంటున్నారు. అయితే జడ్జిని మార్చడం ద్వారా విచారణ కొనసాగనుంది.

# డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాత)

ఎస్పీలు, జిల్లా ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎవరో చెబితే కలెక్టర్లు,ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇవ్వలేదని, సమర్థత ఆధారంగా నిర్ణయం తీసుకున్నామని తేల్చిచెప్పారు. కలెక్టర్లు తప్పని సరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందేనని హుంకుం జారీ చేశారు. డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు ఫిజికల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. రైతు రుణమాఫీ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని వివరించారు. రుణమాఫీ అమలుపైన కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్క రైతుకు నష్టం జరగొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రజలతో మమేకం కండి

(మొదటిపేజీ తరువాత)

ఎన్నికల కోడ్ ముగియగానే కలెక్టర్ల బదిలీలు నిర్వహించాం. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాలనుంచి ఇక్కడికి వచ్చినవారున్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలి. ప్రజలకు లబ్ది చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలి. ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకునేలా పనిచేయాలని రేవంత్ అన్నారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. 9 కీలక అంశాలతో ప్రభుత్వం ఎజెండా రూపొందించింది. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం - కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం - సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు - ఇతర భద్రతాపరమైన అంశాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం తదితర అంశాలను అందులో ఉన్నాయి. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. పలు ముఖ్యమైన అంశాలపై అధికారులు వ్యవహరించాల్సిన తీరుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి నిజమైన లబ్దిదారులను గుర్తించాలని ఆ సమావేశంలో ఆదేశించామని తెలిపారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో మీ నిర్ణయాలు ఉండాలి. ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా మీరు పనిచేయాలి. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి.. మీ ప్రతీ చర్య ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు తెలిసేలా ఉండాలి. ఈ ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలన అందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మీపైనే ఉంది. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే' అని సీఎం స్పష్టం చేశారు. ప్రతీ పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతీ నెలా రూ.85వేలు ఖర్చు పెడుతోందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. విద్యావ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుడిలా స్పందించారని... అలాగే కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితనం ఉండాలని తెలిపారు. ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు విశ్వాసం కల్పించాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సిఎస్ శాంతి కుమారి, వివిధ జిల్లాల కలక్టర్లు,ఎస్పీలు, ఇతర ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాత)

ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి చెందుతారన్నారు. పోలీస్ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని డీజీపీ ఆదేశించారు. పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ చేయాలని చెప్పారు. తాను సైతం త్వరలోనే జిల్లాల వారీగా తని ఖీల చేపడుతానని తెలిపారు. తనతోపాటు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కూడా వివిధ జిల్లాల్లో తనిఖీలు చేపడతారని పేర్కొన్నారు. హిస్టరీ షీట్‌ల సమీక్షించాలని, ఆయుధాల లైసెన్స్‌ల జారీపై జాగ్రత్త వహించాలని, శాంతి భద్రతలు మెరుగైన నిర్వాహణ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించడంతోపాటు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరును అంచనా వేసేందుకు నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీఎం దార్శనికతకు అనుగుణంగా, రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అవసరమైతే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేశ్ భగవత్, హైదరాబాద్ సీపీ కే శ్రీనివాస్ రెడ్డి, అదనపు డీజీపీలు శిఖా గోయెల్, అభిలాష బిష్త్, వీవీ శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, స్టీఫెన్ రవీంద్ర కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బన్సీలాల్ నగర్ బస్ స్టాప్‌లో చైన్ స్నాచింగ్

**రాజేంద్రనగర్, జూలై16(నమస్తే ఉదయం):**
బుద్వేల్ బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో మంగళవారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. బుద్వేల్ లో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నర్స్‌గా పనిచేసే కిస్మత్ పూర్ కు చెందిన మమత(30) మంగళవారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళ్ళడానికి బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో నిలుచుంది. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోనుంచి మూడు తులాల బంగారు మంగళసూత్రం ను లాక్కొని పారిపోయారు. ఈ పెనుగులాట లో మమత క్రింద పడినా, వదలకుండా మంగళసూత్రం ను లాక్కొని వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్ ప్రహరీ దూకి పారిపోయారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో, డీఐ గంగాధర్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**బన్సీలాల్ నగర్ బస్ స్టాప్‌లో తరచు చైన్ స్నాచింగ్‌లు**

బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో తరచు చైన్ స్నాచింగ్ లు జరుగుతున్నాయి. సాయంత్రం వేళలలో డ్యూటీ లకు వెళ్లి వచ్చే మహిళలు బస్ దిగి వెళ్తున్న సమయంలో చైన్ స్నాచింగ్ చేసి వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ ప్రహరీ దూకి దుండగులు పారిపోతున్నారు.

## మధురానగర్‌లో బోనాల వేడుకలకు భారీగా ఏర్పాట్లు

**శంషాబాద్, జూలై 16( నమస్తే ఉదయం):**
శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని మధురానగర్ లోని పోచమ్మ దేవాలయం వద్ద బోనాల వేడుకలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 21వ తేదీన బోనాల వేడుకలను నిర్వహించనుండడంతో భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు




చలివేంద్రి శ్రీకాంత్ రెడ్డి. ముద్దం మల్లారెడ్డి. తోట రాములు ముదిరాజ్.ఆవుల శ్రావణ్ కుమార్. ఈదుల నరసింహ గౌడ్. చేవెళ్ల ప్రసాద్. దమ్మాయిగూడ సంతోష్ రెడ్డి. గోవర్ధన్ రెడ్డి. పవన్ గౌడ్. సామ చెన్నారెడ్డి .జైహింద్ రెడ్డి.మున్నూరు రాజు. గాజుల రాజు. తదితరులు సమావేశాన్ని ఏర్పాటు చేసి దేవాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్ల గురించి సమావేశంలో చర్చించారు.

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ, జమదగ్ని కళ్యాణం

### భారీగా తరలివచ్చిన భక్తులు

**శంషాబాద్, జూలై 16( నమస్తే ఉదయం):** శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు.శంషాబాద్ మండలంలోని గాన్సీమియా గూడ గ్రామంలో వెలిసిన అమ్మవారి ఆలయంలో ఆలయ పూజారులు





గ్రామ ప్రముఖుల సమక్షంలో కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగ నిర్వహించారు. ఆలయ పూజారులు శ్రీశైలం. మల్లికార్జున్. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గుగ్గిళ్ళ రామనాథ ముదిరాజ్. స్థానిక మాజీ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్. మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుకమర్రి మహేందర్ ముదిరాజ్.తదితరుల సమక్షంలో అమ్మవారి కళ్యాణ వేడుకలను నిర్వహించారు. మండలంలోని పాలమాకుల పెద్ద షాపూర్. పెద్ద తూప్రా తండా. మదనపల్లి. శంకరపురం. గ్రామాలతో పాటు కొత్తూరు నందిగామ. షాద్ నగర్ తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. మంచిరేవుల గ్రామానికి చెందిన కృష్ణ భగవాన్ రెడ్డి భక్తులకు భోజన వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సారా కృష్ణ గౌడ్. బిజెపి నాయకులు చింతల నందకిషోర్. స్థానిక నాయకులు రవి గౌడ్. శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి ఊర చెరువు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్లైన్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

**- సిపిఎం మండల కార్యదర్శి కురుమయ్య**

**రాజేంద్రనగర్, జూలై16(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ఊర చెరువు వద్ద జలమండలి చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనుల ను సత్వరమే పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జి కురుమయ్య అధికారులను కోరారు. మంగళవారం

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శివరాంపల్లి ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జిఎం కురుమయ్య సిపిఎం నాయకులు ఎస్ మోహన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కురుమయ్య మాట్లాడుతూ. .. భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులు నత్త నడకన కొనసాగుతుండడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రహదారి గుండా శివరాంపల్లి నుండి వివిధ పనులకు వెళ్లే ప్రజలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని అయితే పైప్ లైన్ పనులు నత్త నడకన కొనసాగుతూ ఉండడం వల్ల గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలు ఇబ్బందుల గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కురుమయ్య కోరారు.



శివరాంపల్లి వద్ద భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు కుర్మయ్య

# వివోఏల ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి

**రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేసిన అమరచింత మండలం విఓఏల సంఘం ప్రతినిధులు**

**హైదరాబాద్,జూలై16(నమస్తే ఉదయం):**
ఐకెపిలో పనిచేస్తున్న విలేజి ఆర్గనైజేషన్ అసిస్టెంట్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగ సంఘం వనపర్తి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. మంగళవారం హైదరాబాదులోని ప్రజా భవన్ లో వివో ఏ వనపర్తి జిల్లా కమిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ జి చిన్నారెడ్డిని కలిసి వివోఏల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల సమాఖ్య లు విధులు నిర్వహిస్తున్న కార్యనిర్వాహక సహాయకులు (వివోఏ) ప్రతి గ్రామంలో సమాఖ్య సంఘాలు ఉన్నాయి.

ప్రతి గ్రామాఖ్య సంఘాలకు విలేజి ఆర్గనైజేషన్ అసిస్టెంట్ లు గా పనిచేస్తున్నాము. తాము 20 సంవత్సరాలగా సంఘాలను తయారు చేస్తూ ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రతి పేద మహిళలకు సమాచారము చేరవేస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయుటకు కృషి చేస్తున్నాము. గ్రామస్థాయిలో జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో వి.ఓ.ఎ.లు పాల్గొని విజయవంతం చేస్తున్నాము. స్వయం సహాయక సంఘాలకు సమావేశాలకు నిర్వహిస్తూ మహిళలు ఖలిగా వున్న సమయంలో వారి ఇంటి దగ్గరకు వెళ్ళి సమావేశాలు నిర్వహిస్తూ అన్ని విషయాలు పూర్తిగా వివరించి లైవ్మీటింగ్లు ఆన్లైన్లో చేస్తున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. మహిళా సమాఖ్య లావాదేవీలు పుస్తక నిర్వహణ చేస్తూ వాటిని ఆన్లైన్లో ఎంట్రీ చేస్తూ స్వయం సహాయక సంఘాలు, వి.ఓ.లకు గ్రేడింగ్ వచ్చేలా చేస్తున్నామన్నారు. ప్రతి మహిళ ఒక వ్యాపారవేత్తగా ఎదుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. తాము నిర్వహిస్తున్న విధులకు వేతనం ప్రభుత్వం చాలా తక్కువ ఇస్తుందన్నారు. ఒకప్పుడు గౌరవ వేతనం లేకుండానే పనులు చేస్తూ వచ్చాము. మన కాంగ్రెస్ ప్రభుత్వంలో మమ్ములను మా కృష్టాలను గుర్తించి రూ.3000/- వేతనంగా ఇచ్చారు. గత ప్రభుత్వములో ఇన్ని పనులు చేసినా మాకు కేవలం 900 లను మాత్రమే పెంచుతూ 3900/- నుండి 5000/- వరకు పెంచడం జరిగిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వీ ఎ వో ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని సంఘం ప్రతినిధులు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డిని కోరారు.



వివో ఏలు తమ సమస్యలపై ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

# అమ్మమాట.. అంగన్వాడి బాట ర్యాలీ

**చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు**

**రాజేంద్రనగర్,జులై 16(నమస్తే ఉదయం):**
మైలార్‌దేవులపల్లి సెక్షన్ బాబుల్ రెడ్డినగర్ అంగన్‌వాడి కేంద్రంలోఅమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం బాబుల్ రెడ్డి నగర్ బస్తీలో అంగన్వాడి టీచర్లు చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ...అంగన్ వాడి కేంద్రంలో రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటాపాటలతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.ఏళ్లు దాటిన పిల్లలందరికి అక్షరాలు, అంకెలు,ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు.చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు.

చిన్నారి పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.రెండున్నరేళ్ల దాటిన పిల్లల పేర్లను ఇంటింటికి తిరిగి నమోదు చేసుకుంటామన్నారు.

గర్భిణీలు, బాలింతలు,చంటిపిల్లలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందే సేవల గురించి తెలిపారు.బోధించే విద్య,అందించే సేవల గురించి టీచర్లు.. పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలను చేర్పించాలని కోరారు.ఐదేళ్లు పూర్తయి అంగన్‌వాడీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు 'ప్రి స్కూల్ సర్టిఫికెట్'ను అందజేస్తామని తెలిపారు. అవగాహన ర్యాలీలో అంగన్‌వాడి టీచర్లు అనిత,మాధవి,ఏఎన్‌ఎం ప్రేమాదేవి, సంగీత, రేణుక, సరిత, మంగ, లక్ష్మి, ఆర్.పి.హేమలత తదితరులు పాల్గొన్నారు.







ఆలయం వద్ద కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద పూర్తి ఏర్పాట్లు చేయాలి: కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**దేవాలయాల వద్ద సిసి,ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై16(నమస్తే ఉదయం):**
బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంటెస్టెడ్ బిజెపి అభ్యర్థి, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో జరగబోయే బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్,మధుబన్ కాలనీ ప్రాంతాలలో అమ్మవారి దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...దేవాలయానికి కాలినడకన వచ్చే భక్తులకు,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చిప్స్, మట్టిని వేయాలని తెలిపారు.బోనాల వేడుకలు ప్రారంభవ నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బోనాల ఉత్సవాల దృష్ట్యా చేపట్టిన సిసి రోడ్డు,ప్యాచ్ వర్క్ పనులను త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్యం బాగుండాలని అధికారులకు ఆదేశించారు.రోడ్లు, డ్రైనేజీలు,వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బి జె పి నాయకులు సి బుచ్చిరెడ్డి, వెంకటరెడ్డి,గోవర్ధన్ రెడ్డి,రాజవర్ధన్ రెడ్డి,ఉత్తమ్,గోపి, శేఖర్,చందు నాయక్,రమేష్ రెడ్డి,గోపాల్ నాయక్, కుర్మయ్య చెన్నమ్మ,పాండు యాదవ్, తలారి చిన్న, శంకర్ రెడ్డి,శేఖర్,మసుదన్ రెడ్డి, మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచుదాం

**కేతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి తారాబాయి**

**కేతిరెడ్డిపల్లిలో ఇంటింటికి మొక్కల పంపిణి**

**మొయినాబాద్ జూలై 16 (నమస్తే ఉదయం):**
పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటింటికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను పెంచాలని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తారాబాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి నర్సరీలో పెంచిన మొక్కలను ఇంటింటికి ఒకే రోజు రెండు వేల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద పెరటి గోడలో, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి చెట్లను పెంచితే కాలుష్య నిర్మూళనకు కృషి చేసిన వారు అవుతామన్నారు. మొక్కలు నాటి చెట్లను పెంచితే మంచి వాతావరణంతో ఆరోగ్యంగా జీవించగలుగుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన వివిధ రకాల మొక్కలు నర్సరీల్లో ఉన్నాయని కావాల్సినవి తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్న కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తారాబాయి



## గద్వాల టౌన్ క్లబ్‌లో

# కుప్పకూలిన గోడలు

### భారీ వర్షాలకు నానిపోయిన గోడలు




**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని గద్వాల టౌన్ క్లబ్ భవనం ఆవరణలో గల షటిల్ కోర్టు గోడ కూలిపోయింది. 1973 సంవత్సరంలో టౌన్ క్లబ్ భవన నిర్మాణం చేశారు. షటిల్ క్రీడాకారులు టౌన్ క్లబ్ ఆవరణలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం టౌన్ క్లబ్ లో అనేక మంది షటిల్ ఆడుతూ ఉంటారు. గతంలో భారీ వర్షాలకు టౌన్ క్లబ్ లోని షటిల్ కోర్టు దెబ్బతినడంతో అప్పటి నుంచి షటిల్ క్రీడాకారులు టౌన్ క్లబ్ లో ఆడటం మానేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు షటిల్ కోర్టు గోడలు నానిపోవడంతో పాటు మంగళవారం కురిసిన భారీ వర్షానికి గోడలు కూలిపోయాయి. దాంతో పాటు ఈదురుగాలులకు రేకులషెడ్డు ఊడిపోయి, కుప్పకూలాయి. పక్కనే ఉన్న ఇంటి మీద రాళ్లు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.




ఇది చెరువు కాదు రోడ్డు మొయినాభాగం నుంచి చిలుకూరు వెళ్లే దారి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన రోడ్డు వేయని దుస్థితి



బిజెపి నాయకుడు

# చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు

### రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి:

### బిజెపి నాయకులు గరుగురాజు ముదిరాజ్

**మొయినాబాద్ జూలై 16 (నమస్తే ఉదయం):** మండలంలోని చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా మారిందని గ్రామస్తులకు చాలా ఇబ్బందిగా ఉందని బిజెపి నాయకుడు గరుగురాజు ముదిరాజ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... చెరువును తలపిస్తున్న చిలుకూరు నుంచి మొయినాబాద్ రోడ్డు కాలువ కాదు. మొయినాబాద్ నుంచి చిలుకూరు వెళ్లే రోడ్డు నమ్మశక్యంగా లేదు కదూ ఇది నిజంగా రోడ్డే. చిలుకూరు నుంచి మొయినాబాద్ సురంగల్ వరకు రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు కొంత దూరం రోడ్డు వేశారు చిలుకూరు నుంచి కొంత దూరం వరకు రోడ్డుకు వేశారు.

మధ్యలో కంకర పోసి వదిలేశారు వర్షం పడిందంటే చాలు రోడ్డుపై నీళ్లు నిలిచి వాహనదారులకు చిలుకూరు నుంచి గ్రామస్తులు డ్వాక్రా మహిళలు డబ్బులు బ్యాంకులో డబ్బులు కట్టేందుకు అంగడికి వెళ్లేందుకు ప్రతి పనికి మొయినాబాద్ వెళ్లాలంటే చాలా ఇబ్బందికి గురవుతున్నారు ప్రభుత్వం అధికారులు పట్టించుకోని తొందరగా చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు చేయించాలని వారు కోరుతున్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలి

### - మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి

**నాగర్ కర్నూల్, జూలై16(నమస్తే ఉదయం):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివకుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ గా తీసుకరావడం కార్మిక హక్కులను కాలరాయడమే అని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు 26వేల రూపాయలు అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చెయ్యాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే ఆ కుటుం బానికి 25 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా అమలు చేయాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులు 30 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. పెరుగు తున్న జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, మున్సిపల్ కార్మికులు, మల్లేష్, ఆంజనేయులు, భాస్కర్, రాముడు, బాలస్వామి, నరసింహ కార్మికుల తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన గగన్ పహాడ్ అప్పా చెరువు

# కనుమరుగవుతున్న అప్పాచెరువు

### కబ్జాదారుల నుండి కాపాడాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి


### ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే చెరువు ఆక్రమణ : బీజేవైఎం నాయకులు వినయ్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూలై16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్‌లో గల అప్పాచెరువు కబ్జాదారుల ఆక్రమణతో కనుమరుగవుతుందని బీజేవైఎం నాయకులు సూ రెడ్డి వినయ్ రెడ్డి అన్నారు.
గగన్ పహాడ్ సర్వే నంబర్లు 89,90,91,176,178లలో అప్పా చెరువు 46 ఎకరాలు ఉందన్నారు. మంగళవారం చెరువును సందర్శించిన సూరెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ..

కబ్జాదారుల వల్ల చెరువు ఆక్రమణకు గురై నీటి నిలువ కు స్థలం లేకపోవడంతో వర్షాకాలంలో జాతీయ రహదారిపై వరద నీరు భారీగా చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ చెరువును అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించి అధికారులకు ఆక్రమణలను తొలగించి కబ్జాదారులు ను కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కానీ ఇప్పటివరకు ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మధ్యలో రైల్వే ట్రాక్ ఉందని ట్రాక్ కు ఆనుకొని మట్టి పోసి రైల్వే స్థలం సైతం కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. వర్షాకాలంలో చెరువు పరివాహక ప్రాంతం నుండి వచ్చే వరద నీరు చెరువులో మట్టి పోయడం వల్ల వెళ్లడానికి పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం చెరువు ఆక్రమణను తొలగించి సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం నాయకులు వినయ్ రెడ్డి రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులను కోరారు.

## చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16 (నమస్తే ఉదయం)** చివరి ఆయకట్ట వరకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ధరూర్ మండలం పరిధిలో ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా కుడికాలువకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమెహన్ రెడ్డి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వ్యవసాయానికి అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం వానకాలం కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమాయ్యారని, కావున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన సమయంలో నీటిని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు ప్రతి సన్నకారు రైతులకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎగువ భాగంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఐదారు రోజుల్లో జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుంటుందని, అనంతరం రిజర్వాయర్లు నింపుతామని పేర్కొన్నారు. రైతులు సమన్వయంతో నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి రామకృష్ణ నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డీ.ఆర్ విజయ్, భీమ్ రెడ్డి ప్రభాకర్ గౌడ్, డి.వై రామన్న, ఆనంద్ గౌడ, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి విజయ్ రెడ్డి, నాగన్న, రంగ స్వామి, కురుమన్న, రాఘువేంద్ర రెడ్డి, శ్రీరాములు, ఆనంద్ రెడ్డి, ఆలీ సురేష్, గోవిందు, ధర్మ నాయుడు, సవారన్న పురుషోత్తం రెడ్డి సంతోష్, పూడూరు చిన్నయ్య, రాజు, ఈ.ఈ రహీముద్దీన్, నీటి పారుదల శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్‌ల సహకారంతో మూసిలో యాంటీ లార్వా ఆపరేషన్

### సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్

### క్రేన్ సహాయంతో గుర్రపు డెక్కను తొలగిస్తాం : ఈ ఈ నరేందర్ గౌడ్



మూసిలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్

**రాజేంద్రనగర్, జూలై16(నమస్తే ఉదయం):** మూసీ నదిలో డ్రోన్ల సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తామని గ్రేటర్ దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ తెలిపారు. అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కోమరయ్య, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్‌లు గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న దృష్టికి మూసిలో గుర్రపు డెక్క పెరగడం వల్ల దోమలు విపరీతంగా అభివృద్ధి చెంది స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో వెంకన్న సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, రాజేంద్ర నగర్ జీహెచ్ఎంసీ ఈఈ నరేందర్ గౌడ్‌లను పంపించి మూసీలో గుర్రపు డెక్కను తొలగించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశీలన చేసి అంచనాలు తయారు చేయమని ఆదేశించారు. దీంతో నామల శ్రీనివాస్ , నరేందర్ గౌడ్ లు తమ సిబ్బందితో కలిసి మూసీ నదిలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను పరిశీలించారు. గుర్రపు డెక్క తొలగించడానికి అంచనాలు సిద్ధం చేసి త్వరలోనే గుర్రపు డెక్కను తొలగిస్తామని తెలిపారు. నామాల శ్రీనివాస్ మాట్లాడుతూ గుర్రపు డెక్క ఉన్న ప్రాంతంలో డ్రోన్ల సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733